31

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

(27)

## (పెదపుల్లేరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 5-2-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు ఏదైనా కష్టములు వచ్చినపుడు భగవంతుని ప్రార్థించటంలో పొరపాటు ఏమీ లేదు. భగవంతుడు మనకు తండ్రిలాంటివాడు. భగవంతుడిని ప్రార్థించటానికి సిగ్గుపడనవసరము లేదు. మనం అడిగినవి భగవంతుడు వెంటనే నెరవేర్చకపోవచ్చును. వెంటనే నెరవేరిస్తే గర్వం వచ్చే ప్రమాదం ఉంది, అహంకారము పెరిగే ప్రమాదము ఉంది. మన కష్టం ఏమిటో ఆయనకు విన్నవించుకుంటే ఆకాలము వచ్చినపుడు తప్పనిసరిగా పరిష్కారం చేస్తాడు. అందులో సందేహం లేదు. కాని అది ఎప్పుడు చేయాలి, ఎక్కడ చేయాలి, ఎలా చేయాలి అనేది భగవంతుడు చూసుకుంటాడు. ఆ ముహూర్తమును భగవంతుడు పెట్టుకుంటాడు.

మీకు ఏదైనా తలంపు వస్తే అది వృధాపోతుంది అని అనుకోవద్దు. మీరు భౌతికంగా బాగుపడాలి అనుకొంటున్నారు అనుకోండి, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలి అనుకొంటున్నారు అనుకోండి. ఆ తలంపులు వృధాపోవు. మీకు వచ్చే ప్రతీ తలంపుకు కూడా భగవంతుడు ఫలితం ఇచ్చి మిమ్మలను అలంకరిస్తాడు. ఫలితం రాదు అని అనుకోవద్దు.

కొంతమందికి సహజంగానే పుట్టుకతోనే విశ్వాసం అనే ప్రవృత్తి ఉంటుంది. భగవంతుడనేవాడు ఒకడు ఉన్నాడు, వాడిని విశ్వసించండి, మీభారం వాడిమీద వేయండి అని వారితో చెపితే వారు హృదయపూర్వకంగా నమ్ముతారు. వారికి ఏమైనా వికారములు ఉన్నా భగవంతునికోసం వాటిని వదలుకొంటారు. వారికి ఇష్టం లేకపోయినా భగవంతుడు వాటిని వదులుకోమని చెపుతున్నాడు కదా అని వాటిని వదులుకొంటారు. దైనందిన జీవితంలో ఏమైనా ఇబ్బందులు వచ్చినా కంగారుపడకుండా భగవంతునిమీద భారం వేసి ధైర్యంగా ఉంటారు. ఎవడైతే తన భారం అంతా భగవంతుని మీద వేసాడో వాడికి భయం తగ్గుతుంది. మానవునికి భయంవలన చాలా వికారములు వస్తాయి. భయం ఎక్కువగా వస్తూ వుంటే భగవంతుని మీద భారం వేయటం లేదు అని అర్థం. భగవంతునిమీద భారం వేసే కొలది భయం తగ్గుతుంది. (గణపతి శాస్త్రిగారు రోజూ ఏదో ప్రశ్నలు వేస్తూ ఉండేవారు. ఇలా ప్రశ్నలు రేపుకొని సందేహాలు రేపుకోవటం కంటే భగవంతుని మీద భారం వేయటం నేర్చుకోండి శాస్త్రిగారు అని భగవాన్ చెప్పేవారు. భగవంతునిమీద భారం వేస్తే మీకు చాలా సందేహాలు తగ్గుతాయి.)

కొంతమంది భగవంతుడు ఉన్నాడా? ఉంటే నాకు ఎందుకు కనిపించటం లేదు. ఇలా అనేవారు ఉంటారు. దేవుడు ఉన్నాడో, లేడో. నేను అనేది నీకు ప్రత్యక్షంగా తెలుస్తోంది కదా. ఆ నేను ఎవడో తెలుసుకోవటానికి ప్రయత్నించు. ఆ నేను ఎవడో నీకు తెలిసిన తరువాతకూడా నీకు దేవుని తెలుసుకోవాలి అనే సంకల్పము ఉంటే అప్పుడు తెలుసుకొందువుగాని. దేవుడు మనకు అత్యంత సమీపములో మన హృదయంలోనే ఉన్నా, ఎక్కడో వైకుంఠములో ఉన్నాడని అనిపించటానికి కారణము మన దేహబుద్ధి.

దేహం మరణించినపుడు మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను మరణించదు. మనం ఒక ఇంటిలో ఉంటున్నప్పుడు అది నివాసయోగ్యంగా లేకపోతే, శిధిలమైతే ఆ ఇంటినుండి తప్పుకొంటాము.

అలాగే ఈ దేహము నివాసయోగ్యం కానపుడు, దేహం శిథిలమైనపుడు జీవుడు ఈ దేహమును విడిచిపెట్టేస్తాడు. అలాగంటే కొంతమంది చిన్నవయస్సులోనే ఎందుకు మరణిస్తున్నారు అని అడుగుతారు. ఇక్కడ వయస్సుకాదు, దేహం శిథిలం అవ్వటం ముఖ్యం. కొంతమందికి ఒక సంవత్సరానికే దేహం శిథిలం అవ్వవచ్చు, కొంతమంది వంద సంవత్సరాలు బాగా ఉండవచ్చు. దేహం ఎప్పుడు శిథిలమయితే అప్పుడు జీవుడు ఆదేహమునుండి విడిపోతాడు. దేహమునకు జబ్బు వస్తే స్మశానంలో దేహం కాలిపోయినపుడు ఆ జబ్బులు కాలిపోతాయి. కాని జీవుడికి ఉండే గుణాలు భౌతికమైన అగ్నికి కాలవు. అవి అలాగే ఉంటాయి. మనం సాధన చేసి, దేవుని ప్రార్థించి, దేవుని అనుగ్రహాన్ని అర్థించి వీటిలోనుండి విడుదలపొందటానికి అభ్యాసము చేస్తూ అందులోనుండి విడుదల పొందాలి.

భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. కాని విషయములను భోగించాలి అనే ఆసక్తివలన నీకు భగవంతుడు తెలియటం లేదు. రాబోయే జన్మలు, పుణ్యపాపములు, దుఃఖము, కష్టాలు, సుఖాలు అన్నీకూడా దేహగతమైన నేనును ఆశ్రయించుకొని ఉన్నాయి. అందువలన మీ సాధన అంతా పూజకు, జపమునకు సరిపెట్టకుండా నీవు చేసేపనివలన, మాట్లాడే మాటలవలన దేహబుద్ధి తగ్గేటట్లు చూసుకోవాలి.

మనకు స్వార్థం ఉంది అనుకోండి. దానిని ఒకేసారి తగ్గించుకోలేము. కొద్దిగా తగ్గించుకొన్నా మనం సమాజమునకు ఉపయోగపడగలము. స్వార్థం పూర్తిగా వదిలివేస్తే మనం ఋషి అయిపోతాము. మానవుడికి అధికారంఉందా, అధికారంలేదా, సంపదఉందా, సంపదలేదా అన్నది కాదు వాడు స్వార్థమును ఎంతవరకూ తగ్గించుకొంటే అంతవరకూ వాడికి ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా వాడిద్వారా సమాజమునకు సహాయం జరుగుతుంది.

ఇతరులకు నీవు చేసే సహాయం అంతా నీకే తిరిగివస్తుంది అని తెలిస్తే సహాయం చేయకుండా ఎలా ఉండగలవు అన్నారు భగవాన్. ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే, మంచి కార్యములకోసం డబ్బు ఖర్చు చేస్తే ఆ డబ్బు అంతా Waste అయిపోయింది అనుకోవద్దు. అది అంతా దేవుని Bankలో జమ అవుతుంది. అది నీ మరణానంతర జీవితములో నీకు ఉపయోగపడుతుంది. ఇక్కడ ఎవరైనా ధనవంతులు ఉంటే మీ డబ్బును సద్వినియోగం చేయండి. సద్వినియోగం చేసిన డబ్బు అంతా waste అవుతోంది అనుకోవద్దు. అది అంతాకూడా మీ మరణానంతర జీవితములో మీకు ఉపయోగపడుతుంది అని చెపుతున్నారు. మీకు ధనం ఉన్నా, అధికారం ఉన్నా, చదువు ఉన్నా ఇవి అన్నీ దేవుడు ఇచ్చిన సంపదలే. మీకు ఏ శక్తులు అయితే ఉన్నాయో వాటిద్వారా తోటివారు అభివృద్ధి అవ్వటానికి, వారి చైతన్యస్థాయి పెరగటానికి కృషి చేయండి. నీవు భౌతికంగాను, ఆధ్యాత్మికంగానూ అభివృద్ధి పొందటానికి ఈ కృషి నీకు సహకరిస్తుంది. సామాజిక స్పృహ కూడా అవసరమే. సామాజిక స్పృహవలన కూడా చైతన్యస్థాయి పెరుగుతుంది. భగవదనుభవం పొందటానికి అది కూడా నీకు సహకరిస్తుంది.

పూజగదిలో కూర్చున్నప్పుడు మనలోని బలహీనతలు తెలియవు. కర్మ చేసేటప్పుడే మనలోని బలహీనతలు తెలుస్తాయి. మనలోని బలహీనతలు తెలిస్తేగాని వాటిని తొలగించుకొనే ప్రయత్నం మనం చేయము. కొన్ని నియమాలు లేకపోతే, లక్ష్యం లేకపోతే భౌతికంగా కూడా మనం అభివృద్ధిలోనికి రాలేము. భౌతికంగా అభివృద్ధిలోనికి రావటానికి నియమబద్ధమైన జీవితం అవసరమయినపుడు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి నియమబద్ధమైన జీవితం అవసరము అని వేరే చెప్పనక్కరలేదు.

నేను అంటే నాకు చాలా ఇష్టం. ఆ నేను లేకపోతే నేను ఉండలేను. చనిపోయిన తరువాత ఈ నేను కనబడదేమోనని భయంగా ఉంది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. చనిపోయిన తరువాత నేను ఉండదేమోనని

భయం వేస్తోంది అంటున్నావు, గాఢనిద్రలో ఈ నేను కనబడటం లేదు కదా అని భగవాన్ అంటున్నారు. గాఢనిద్రలో ఈ నేను గొడవ ఉండదు అని తెలిసికూడా నిద్రకోసం ఎందుకు ఏడుస్తున్నావు అంటున్నారు. నిద్ర రాకపోతే కంగారుపడిపోతాము. ఒకరోజు నిద్ర రాకపోతే నిద్రబిళ్ళలు తెచ్చుకుంటాము. గాఢనిద్రలో ఈ నేను గొడవ ఉండదు. మరి ఎందుకు కావాలని నిద్రను కోరుకొంటున్నావు. మరణం మాట వదిలివెయ్యి. గాఢనిద్రలో నేను గొడవ ఉండదు కాబట్టి నిద్ర నాకు వద్దు అని ఎందుకు చెప్పటం లేదు. జాగ్రదావస్థలో కంటే, స్వప్నావస్థలోకంటే గాఢనిద్రలో నీవు సత్యమునకు దగ్గరగా ఉన్నావు. గాఢనిద్రలో మనస్సునుండి విడిపోతున్నావు. అంటే మనస్సు కల్పించిన విషయములనుండి కూడా విడిపోతున్నావు. నేను పోతే నీవు పోతావు అని అనుకోవద్దు. నీవు ఎవరివో నీకు తెలుస్తుంది. అవతారపురుషులు, గురువులు మానవుడిని దుఃఖము లేని స్థితికి తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నం చేస్తారు. సైన్సు మానవుడిని దుఃఖము లేనిస్థితికి తీసుకొని వెళ్ళలేదు. సైన్సు మానవునియొక్క కల్పితము. ఎవరికి ఏ విషయం తెలుసునో వారిని ఆ విషయం గురించి అడిగి తెలుసుకోవాలి. సైన్సుకు చేతకాని పనిని సైన్సును చేసిపెట్టమని అడగకూడదు.

ఎలాగూ దేహం వచ్చేసింది. దేహము ప్రారబ్ధమును అనుభవిస్తోంది. ఏ ప్రారబ్ధమును అయితే నీవు అనుభవిస్తున్నావో దానిని చిరాకుగా అనుభవించకు. ఇష్టంగా, ప్రీతిగా, ప్రేమగా అనుభవించు. పరిస్థితులు నీకు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగాఉన్నా నీ శాంతిని పోగొట్టుకోవద్దు. నీ శాంతచిత్తమును పోగొట్టుకోవద్దు. శాంత చిత్తముతో నీలోని బలహీనతలతో పోరాడు. దేహప్రారబ్ధమునకు React అవ్వకుండా ఇష్టంగా, ప్రేమగా, ప్రీతిగా అనుభవిస్తూ ఉంటే కొత్తవాసనలు రావు, పాతవాసనలు పోతాయి.

ఒక ఉపనిషత్‌లో ఋషి ఏమని చెప్పాడు అంటే నీవు ఏ సత్యమునయితే తెలుసుకోవాలి అనుకొంటున్నావో అది దూరముగా ఉన్నది. అది దగ్గరగా ఉన్నది అని చెప్పాడు. అంటే తెలియనివాడికి దూరముగా ఉన్నది. తెలిసినవాడికి దగ్గరగా ఉన్నది. మనస్సు ఏదో చింత లేకుండా ఉండలేదు. విషయాలు చింతించే బదులు, భోగాలను చింతించే బదులు ఆత్మనే చింతించు. నిరంతరము నన్నే స్మరిస్తూ ఉంటే, నన్ను కేంద్రముగా పెట్టుకొని పనిచేస్తూ ఉంటే, హెచ్చుతగ్గులు లేకుండా నీ మనస్సును సమానంగా ఉంచుకొని పనిచేస్తూ ఉంటే నీ కృషిని చూసి ఎటువంటి బుద్ధిని ఇస్తే నేను తెలియబడతానో అటువంటి సద్బుద్ధిని నీకు ప్రసాదిస్తాను అని భగవంతుడు వాగ్దానం చేస్తున్నాడు.

ఇష్టము, ద్వేషము, దుఃఖము, కోరికలు, భయం ఇవి అన్నీకూడా అహంకారమును ఆశ్రయించుకొని ఉన్నాయి. ఇది అంతానిజంక్రింద నీవు భ్రాంతి పడుతున్నావు. ఇవి అన్నీ దేనినైతే ఆశ్రయించుకొని ఉన్నాయో ఆ ఆధారము పడిపోతే ఇవి అన్నీ కుప్పకూలిపోతాయి. అహంకారము పేకముక్కలతో కట్టిన కోట అన్నారు భగవాన్. ఇటుకలతో, సిమ్మెంటుతో కడితే పడగొట్టటం కష్టంగాని పేకముక్కల కోటను పడగొట్టడానికి పెద్ద కష్టం అక్కరలేదు. నీవు రవ్వంత, ముల్లంత విచారణ చేస్తే ఆ పేకముక్కలతో కట్టిన అహంకారము అనే కోట రాలిపోతుంది.

గాఢ నిద్రలో అహంకారము లేదు. అహంకారము ఎక్కడనుండి పుట్టివస్తోందో గాఢనిద్రలో అక్కడకు వెళ్ళి కలిసిపోతుంది. జాగ్రదావస్థలోనికి వచ్చినపుడు అహంకారము ముందుగా వచ్చి దేహముతో కలిసిపోతుంది. నేను అనే తలంపు ఎంత వేగముగా హృదయంలోనుండి వస్తుంది అంటే మనకు మెలుకువ వచ్చింది అనుకొంటాము కదా ఈ లోపుగానే అది వచ్చి దేహముతో కలిసిపోయి ఉంటుంది. అప్పుడు దేహము నేను, దేహమును నేను అని మొదలు పెడుతుంది. తరువాత వృత్తితోటి, రాగద్వేషములతోటి, మిగిలిన విషయములతోటి తాదాప్యం పొందుతుంది.

నీవు దేనినైతే పొందుదామని అనుకొంటున్నావో ముందు దానిని ప్రేమించు, దానికి సంబంధించిన నిష్ఠ సంపాదించు. నీ జీవితమునకు ఒక లక్ష్యం పెట్టుకో. మధ్యలో వచ్చే విషయముల దగ్గర ఆగకు. నీ దృష్టిని అంతా చైతన్యం మీద కేంద్రీకరించు. అక్కరలేని గొడవలను, అవసరం లేని వ్యవహారములను మీద పెట్టుకొని కాలమును, శక్తిని వృధా చేసుకోవద్దు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను పాడుచేసుకోవద్దు. ఒకేసారి బ్రహ్మానుభవం మనకు కలుగకపోయినా భగవంతుడు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటే **higher birth** ఇస్తాడు. ఏ కుటుంబంలో జన్మ ఇస్తే నీకు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి అవకాశం ఉందో అక్కడ జన్మను ఇస్తాడు.

మన మనస్సులో ఉన్న అశాంతే మనకు సమాజములో కనబడుతోంది. మనకు సరియైన ఆహారపు అలవాట్లు లేక, ఆహార, విహారములలో సరిఅయిన క్రమశిక్షణ లేకపోవటం వలన మనకు అశాంతి వస్తోంది. ఆహారపు అలవాట్లలో జాగ్రత్తగా ఉండండి, ఆరోగ్య సూత్రాలను పాటించండి అని చెప్పేవారు ఎవరూ లేరు. ఆహారం యొక్క ప్రభావం ఎంత ఉందో ఇంకా సమాజమునకు అవగాహన కావటం లేదు. ఆహారం యొక్క ప్రభావము శరీరము మీద, మనస్సుమీద అతి బలీయంగా ఉంటుంది. అందువలన ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రమణమహర్షిగారికి నియమాలగురించి చెప్పే అలవాటు చాలా తక్కువ. కాని అన్ని నియమాలలోనికి ఆహారనియమం ఉదాత్తమైనది, అద్భుతమైనది అని తరచుగా చెప్పేవారు. ఆహారనియమమును పాటిస్తూ ఉంటే ఆధ్యాత్మిక అభివృద్ధిలో 100కి 50 మార్కులు సాధించినట్లే అని చెప్పారు. ఆత్మానుభవం కలగటానికి సాత్వికాహారం, మౌనం కూడా నీకు సహకరిస్తాయి. సాధ్యమైనంత వరకూ మౌనమును అలవాటు చేసుకో. సాత్వికాహారం నియమంగా తినాలి. సాత్వికాహారం కదా అని అతిగా తినకూడదు. అతిగా తిన్నవాడికి, పూర్తిగా తిండిమానివేసిన వాడికి యోగం సిద్ధించదు. ఆహార, విహారముల విషయంలో సమానంగా ఉండాలి.

దేహము నీవు కాదు, మనస్సు నీవు కాదు, నీవు చైతన్య స్వరూపుడవు అని శాస్త్రములు చెపుతున్నాయి కదా. దేహము నేను కానపుడు దేహము నేను అనే బుద్ధి నాకు ఎందుకు కలిగింది అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నీవు పూర్వ జన్మలలో చేసిన పుణ్యము, పాపము నీకు అనుభవంలోనికి తెప్పించటం కోసం దేహం నీవు కాకపోయినా పరమేశ్వరుడు నీకు దేహబుద్ధిని కల్పించాడు అని చెప్పారు. దేహబుద్ధి నీకు లేకపోతే పూర్వజన్మకు సంబంధించిన విషయాలు నీకు అనుభవంలోనికి రావు. కొంతమంది మేము సుఖంగా ఉన్నాము అంటారు. సుఖపడేవారికి పుణ్యప్రారబ్ధము, దుఃఖపడేవారికి పాప ప్రారబ్ధము ఖర్చు అవుతోంది. అందువలన మీకు ఏ కారణం వలన దుఃఖము వచ్చినా కంగారు పడకండి. మీ పాపము ఖర్చు అవుతోంది అని గ్రహించండి. కర్మానుభవం నీకు కలుగజేయటానికే దేహబుద్ధి వచ్చింది. నీకు దేహబుద్ధి నశించింది అనుకో సంచితం లేదు, ఆగామి లేదు, ప్రారబ్ధం లేదు.

శాస్త్రములో ఏమి చెపుతున్నారు అంటే దేహబుద్ధి నశించినవాడికి సంచితం, ఆగామి నశిస్తాయి. కాని ప్రారబ్ధం నశించదు. ప్రారబ్ధమును అనుభవించటం తప్పదు అని చెపుతున్నారు కదా అని భగవాన్‌ను అడిగారు. దశరథుడికి ముగ్గురు భార్యలు. దశరథుడు మరణిస్తే ఇద్దరి భార్యలకు వైధవ్యం వస్తుందా, ముగ్గురికీ వస్తుందా అని భగవాన్ అడిగారు. ముగ్గురికీ వస్తుంది. అలాగే దేహబుద్ధి నశించినపుడు రెండు పోయి, మూడవది ఉండదు. మొత్తం మూడూ పోతాయి అన్నారు భగవాన్. బ్రహ్మానుభవం పొందినవాడి దేహం ప్రారబ్ధం అనుభవిస్తోంది కదా, అది మనం చూస్తున్నాము కదా. ప్రారబ్ధము లేదు అని ఎలా చెప్పగలము అని భగవాన్‌ను అడిగారు. దీనికి భగవాన్ అద్భుతమైన సమాధానం చెప్పారు. బ్రహ్మానుభవం

పొందినవాడికి ఆగామి, సంచితములతోపాటు ప్రారబ్ధం కూడా నశిస్తుంది. కాని చూసేవాడికి వాడు ప్రారబ్ధం అనుభవిస్తున్నట్లు అనిపిస్తుంది. జ్ఞాని నేను ప్రారబ్ధమును అనుభవిస్తున్నాను అని అనుకోడు. వాడు ప్రారబ్ధమును అనుభవిస్తున్నాడు అని చూసేవాడు అనుకొంటున్నాడు. నేను ప్రారబ్ధమును అనుభవిస్తున్నాను అనుకొనేవాడు అక్కడ లేడు. వాడు ఏనాడో చచ్చిపోయాడు. వాడు చచ్చిపోయినపుడే ప్రారబ్ధం కూడా చనిపోయింది.

చదువు, డబ్బు, అధికారము మనిషికి అవినయమును తీసుకొని వస్తాయి, గర్వమును తీసుకొని వస్తాయి. గర్వం వలన మనం పతనమవుతాము. ఈ భౌతిక శక్తులు మీలో ఉన్నప్పటికీ సాధన చేసేవారు గర్వం రాకుండా చూసుకోవాలి. ఎంత ఎక్కువ ధనం ఉంటే, ఎంత ఎక్కువ చదువు ఉంటే, ఎంత పెద్ద అధికారము ఉంటే అంత వినయంగా ఉండాలి. లేకపోతే వాటిని పోషించుకోలేము. ఇది సాధకుడి లక్షణము.

ఆత్మ ఆత్మ అంటున్నారు, ఆత్మ అంటే ఎవరు అని అడిగారు. ఆత్మ అంటే మనమే. మనం దేహము అని అనుకొంటున్నాము కాబట్టి ఆత్మ అంటే ఎవరో అనుకొంటున్నాము. కాని ఆత్మ అంటే మనమే. ఆత్మ మనకు అనుభవంలో లేదు కాబట్టి అది లేదు అనుకొంటున్నాము. దేహము, మనస్సు మనకు అనుభవంలో ఉన్నాయి కాబట్టి అవి ఉన్నాయి అనుకొంటున్నాము. మనకు అనుభవంలో ఉన్నవి ఉన్నాయి అనుకొంటున్నాము. మనకు అనుభవంలో లేనివి, అవి ఉన్నా కూడా లేవు అని అనుకొంటున్నాము ఎందుచేతనంటే అవి మనకు చిక్కటం లేదు కాబట్టి

అనుకొన్నవి అన్నీ జరిగిపోతూ ఉంటే అంతా నావలననే జరుగుతోంది అనుకొంటాడు. ఏదైనా ఆశాభంగము కలిగితే మాత్రం మనకంటే **higher power** ఉంది అనుకొంటాడు. కోరికల వలన చాలా ప్రమాదము. కోరిక నెరవేరితే గర్వం వస్తుంది, నెరవేరకపోతే దుఃఖము వస్తుంది. అందరికీ మంచిగానే ఉండాలి అని ఉంటుంది కాని పొరపాట్లు చేస్తారు ఎందుకు అని అడిగితే దీనికి కారణము కోరిక అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఏదైనా కోరిక వస్తే దానిని సంతృప్తిపరచటానికి ప్రయత్నం చేస్తాము. కోరికలను సంతృప్తిపరుస్తూ ప్రయాణంచేస్తూఉంటే నిప్పుమీద పెట్రోలు పోసినట్లుగా అవి పెరుగుతాయి. కోరికలను నెరవేర్చుకొంటూ వెళితే కోరికలను జయించలేవు. నెరవేరిన కోరికలు మరల కోరికలను తీసుకొని వస్తాయి. అందువలన కోరికలను నిగ్రహించటం ప్రారంభించు. కోరికలను నిగ్రహిస్తూ ఉంటేఅవి అణుగుతాయి. నీకు ఏదైనా కోరిక వస్తే భగవంతుని స్మరించుకొని దానిని అదుపుచేసుకొంటే అదుపు చేసుకొన్న కోరికలు నీకు శాంతిని తీసుకునివస్తాయి. నెరవేరిన కోరిక నీకు అశాంతిని తీసుకొని వస్తుంది. మనం ఏది అనుభవిస్తున్నప్పటికీ మనస్సు రిపిటేషన్ కోరుతుంది. మనం కాఫీ త్రాగుతాము అనుకోండి. మరల రేపు అదే టైముకు కాఫీ త్రాగాలని అనిపిస్తుంది. అంటే మనస్సులో ముద్రలుపడిపోతాయి, రిపిటేషన్ కోరుతుంది.

నీ హృదయంలో ఉన్న తత్వం నీకు అనుభవంలోనికి వచ్చినపుడు పూర్వజన్మలు లేవు, రాబోయే జన్మలు లేవు, పుణ్యాపాపములు లేవు, లోకము లేదు, ఏదీ లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఇప్పుడు దేహము నీకు నేనుగా ఎలా వ్యక్తమవుతోందో అలాగే పరమసత్యము నీకు నేనుగా వ్యక్తమయినపుడు ఇవి అన్నీ సున్నా అన్న సంగతి నీకు తెలుస్తుంది. నీకు తత్వం అనుభవంలోనికి వచ్చాక తెలియకుండా ఇప్పటి వరకూ ఎంత బాధపడ్డాను, ఎంత దుఃఖ పడ్డాను అని నిన్ను చూసి నీకే ఆశ్చర్యం కలుగుతుంది అంటున్నాడు పరమేశ్వరుడు. ఇప్పుడు మీకు బాధకలుగవచ్చు, దుఃఖము రావచ్చు. తత్వం అనుభవంలోనికి వచ్చాక మీరు పడ్డ బాధలు, మీకు వచ్చిన దుఃఖము అంతాకూడా స్వప్నసమానము అని మీకు అనుభవంలోనికి వస్తుంది.

దేహము చనిపోయిన తరువాత దేహం ఉండదు కదా అని భగవాన్‌తో అంటే ఇప్పుడు కూడా దేహము లేదు అని భగవాన్ అంటున్నారు. ఇప్పుడు దేహము కనిపిస్తూ ఉంటే లేకపోవటం ఏమిటి అని అడిగారు. దేహం నేను అనేది ఒక తలంపు. దేహమునకు సంబంధించిన తలంపు వచ్చినపుడు దేహం ఉంది అని నీకు తెలుస్తోంది. ఆ తలంపు లేకపోతే దేహం గొడవలేదు. గాఢనిద్రలో నీకు దేహం గొడవ లేదుకదా. దేహం చనిపోయినపుడు మనం చనిపోతున్నాము అని అనుకొంటున్నాము. అది కూడా నిజం కాదు. అది కూడా ఒక తలంపే అన్నారు.

నేను ఎవడను అను విచారణ చేస్తూ నేనుకు ఏగుణాలు ఉన్నాయో, ఏ విషయాలు ఉన్నాయో, ఏ భోగాలు ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికి ఈ నేను ప్రయత్నం చేస్తున్నప్పుడు వాటితోపాటు ఈ నేను కూడా పోతుంది. శవం సరిగా కాలటానికి చాకలివాడు తన చేతిలో ఉన్న కర్రతో దానిని సరిచేస్తూ ఉంటాడు. చాకలివాడిచేతిలో ఉన్న కర్ర శవం సరిగా కాలటానికి సహకరిస్తూ అది కూడా కాలిపోతుంది. అలాగే నేను ఎవడను అను విచారణ ఏవిషయములయితే నిన్ను బంధిస్తున్నాయో వాటిని కాలుస్తూ చివరకు అది కూడా కాలిపోతుంది. ఇతర తలంపులను కాలుస్తూ మూలతలంపు అయిన అదికూడా కాలిపోతుంది. ఇవి అన్నీ బూడిద అయిన తరువాత నీలో ఉన్నపరమసత్యం తానుగా నీకు వ్యక్తమవుతుంది.

భగవంతునికి ఇష్టమైన పనులు చేస్తూ ఉంటే, దేవునికోసం జీవిస్తూ ఉంటే మనకు తెలియకుండా అహంభావనకు దూరం అవుతాము, భగవంతునికి దగ్గర అవుతాము. ఎవరికి ఇష్టమైన పనులు వారు చేస్తూ ఉంటారు. అలాకాకుండా మనకు ఇష్టం లేకపోయినా ఇది మంచిపని అని భగవంతుడు చెప్పాడు–కాబట్టి ఆ పనిని మనకు ఇష్టంగా మరలించుకోవటంవలన దేవుని అనుగ్రహానికి పాత్రులవుతాము. దేవుడు అది మంచి పని అని చెప్తున్నాడు కాబట్టి ఏమీ సందేహించకుండా దానిని ఇష్టం చేసుకొని ఆచరించటం ప్రారంభిస్తే ఆయన స్వరూపమును మనకు ఇస్తాడు.

నీమూలం నీ హృదయంలోనే ఉంది. నీ మూలాన్ని తెలుసుకొంటే నీవు పోవు. నీవు ఎవడివో నీకు తెలుస్తుంది. నేను అనే తలంపుయొక్క మూలం తెలియకుండా దేవుడు తెలిసాడు అంటే అది నిజం కాదు అని చెప్పారు. ఎందుచేతనంటే నేను అనే తలంపు యొక్క మూలంలోనే దేవుడు ఉన్నాడు. నీవు వెతికే సుఖము, శాంతి నీ హృదయంలోనే ఉన్నాయి. నీవు లోపల వెతకటం ప్రారంభిస్తే ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా అవి తెలుస్తాయి. నీవు జ్ఞానమును సంపాదించటానికి ప్రయత్నించు. నీ ప్రవర్తన జ్ఞానమును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి సహకరించాలి. దీనికి క్రమశిక్షణ అవసరము. మౌనం మీకు అలవాటు అయితే మంచిది.

శాస్త్రము మార్గమును సూచిస్తుంది. అంతవరకూ శాస్త్రమును ఉపయోగించుకో, తరువాత ప్రయాణం ప్రారంభించు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడు గాని శాస్త్రములో ఉన్నాను అని చెప్ప లేదు. హృదయంలో వదిలివేసి భగవంతునికోసం శాస్త్రములలో వెదికితే భగవంతుడు తెలియడు. భగవంతుడు శాస్త్రములలో ఉన్నాడు అని శాస్త్రములలోకూడా చెప్పటం లేదు. నీ హృదయంలోనే ఉన్నాడు అని శాస్త్రము చెపుతోంది. కాని మనం భగవంతునికోసం హృదయంలో వెతకటం మానివేసి శాస్త్రములో వెతుకుచున్నాము. ఇది మనం చేసే పొరపాటు. శాస్త్రములో వెదుకుచున్న సాధకులను శాస్త్రమునుండి విడదీసి హృదయంలో వెతికేటట్లు చేయటానికి రమణాచార్యుడు ఈ భూమిమీదకు వచ్చాడు. మరుగు పడిన జ్ఞానమార్గమును పునరుద్ధరించటానికి రమణాచార్యుడు ఈ భూమిమీదకు వచ్చాడు. వస్తువు ఎక్కడఉందో అక్కడ వెతికితే ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలో అయినా అది నీకు తెలుస్తుంది. వస్తువు ఎక్కడ లేదో అక్కడ వెతికితే ఎన్ని జన్మలు వెతికినా అది తెలియదు. వస్తువు ఎక్కడ ఉందో, ఎలా వెతకాలో నిర్దేశించి చెప్పటానికి వచ్చిన అవతారము రమణావతారము.

★